ఓం శ్రీ సాయిరాం

# “కృష్ణా తరంగాలు”

(సంగీత నృత్య నాటకం)

## పాత్రలు

| | | |
|---|---|---|
| శంకరం | - | సత్యసాయి ప్రేమబాటలో నడిచే వ్యక్తి |
| సురేష్ | - | రంగనాధం కొడుకు |
| రమేష్ | - | సురేష్ మిత్రుడు |
| వరదయ్య | - | మహాకవి క్షేత్రయ్య |
| పూజారి | - | శివాలయ పూజారి |
| వేద పండితులు | - | శివాలయ వేద పండితులు |
| శ్రీకృష్ణుడు | - | అవతార పురుషుడు |
| రంగనాధం | - | శ్రీమంతుడు |
| జానకమ్మ | - | రంగనాధం భార్య |
| జగన్నాధం | - | రంగనాధం మిత్రుడు |

## పాటలు

1. దుర్గయే అధిదేవత ఇలలో
2. గోపాలా గోపాలా మువ్వగోపాలా
3. ఉపనిషత్తులలో ఊయలలూగే
4. పదండి ముందుకు
5. మన మాతృభూమి ఈ దివ్య భారతికి
6. కన్నీటి పాదాలు కడిగేము తల్లీ

## పద్యాలు

1. పుడమి కన్నతల్లి
2. తల్లికైవడి అన్ని తప్పులు సైచియు
3. ఏ దేశమేగినా నీ నామమే సుమ్మీ

## శ్లోకం

1. వందే సుందర మందహాస వదనం

# "కృష్ణా తరంగాలు"

## (సంగీత నృత్య నాటకం)

రచన : ఎం.ఎస్. ప్రకాశరావు

(కృష్ణానదీ తీరంలో ప్రశాంతమైన ఆశ్రమం, శంకరం వినయంగా ప్రార్థిస్తూ ఉంటాడు)

శంకరం : శ్లో: వందే సుందర మందహాస వదనం కారుణ్య వారాన్నిధిం
భారద్వాజ పవిత్ర గోత్రోద్భవం ఆపస్తంబ సూత్రం విభుమ్
ఉద్యద్భాను మరీచి మండలరుచిం ప్రేమస్వరూపం ప్రభుం
శాంతిశ్రీ వలయం, ప్రశాంతి నిలయం, సత్యం శివం సుందరమ్.

సురేష్ : సాయిరాం అంకుల్

శంరం : సాయిరాం, రా సురేష్

సురేష్ : అంకుల్ మీ ఆశ్రమం, ఈ వాతావరణం చూస్తుంటే మనస్సులో ప్రశాంతత నిండి ఇక్కడే ఉండిపోవాలనిపిస్తోంది.

శంకరం: భగవన్నామస్మరణ చేసుకొంటూ, ప్రేమతో అందరినీ పలకరిస్తూ ఉంటే మీ ఇంట్లోనూ ఇలాంటి వాతావరణం సృష్టించుకోవచ్చు సురేష్

సురేష్ : ఈ సందర్భంలో మిమ్మల్ని ఒక సందేహం అడగనా అంకుల్?

శంకరం: అడుగు సురేష్

సురేష్ : మీరూ, మా డాడీ, జగన్నాధంగారూ అందరూ ఒకే స్కూల్‌లో కలసి చదువుకున్నారు. కలిసి ఆడుకున్నారు. మా డాడీ, జగన్నాధంగారూ సంపన్నులవ్వాలనే లక్ష్యంతో అహోరాత్రులు వ్యాపారంలో మునిగిపోయి కోట్లకు పడగలెత్తారు. కానీ మీరేమో ఎన్ని ఉన్నతోద్యోగాలు వరించినా వెళ్ళకుండా ఈ కృష్ణాతీరంలో అనాధలైన ఈ పిల్లల్ని ఆదరిస్తూ, మీ జీవితాన్ని ఆదర్శంగా గడుపుకుంటున్నారు. మీ దృక్పథంలో ఈ వైవిధ్యం ఎలా కలిగింది?

శంకరం: పద్యం : పుడమి కన్నతల్లి పూజనీయులు కదా
వారి మించువారు వసుధలేరు
తల్లిసేవకన్న మించినదది యేది
జన్మభూమి కన్న స్వర్గమేది

అంటారు మా బాబా. సురేష్, ఈ పవిత్ర కృష్ణాతీరం నా జన్మభూమి. అమృతంలాంటి ఈ కృష్ణాతరంగాలు ఎన్ని భూముల్ని సస్యశ్యామలం చేశాయో, ఎందరి హృదయాలలో భక్తి భావనలు వికసింపచేశాయో, సంగీత సాహిత్య నృత్య కళల్ని ఎలా వర్ధిల్లచేశాయో తలచుకుంటే శరీరం

పులకించిపోతుంది. జన్మభూమితో ఈ అనుబంధానికి ధనంతో విలువ కట్టగలమా. తల్లిదండ్రులు లేని ఈ పిల్లల యోగక్షేమాలు చూసుకుంటూ, వారి కళ్ళల్లో తొణికిసలాడే తృప్తి, ఆనందం చూస్తూంటే కలిగే ఆనందం కోట్లు కూడబెడితే వస్తుందా చెప్పు.

రమేష్ : ఈ కృష్ణా తరంగాలు ఇంత సంస్కారాన్ని కలిగిస్తాయా అంకుల్

శంకరం: రమేష్! ఈ కృష్ణా తరంగాల చెంత కొలువై ఉండి భక్తుల ఆర్తిని తీర్చే కల్పవల్లి, కరుణామతల్లి, అమ్మలగన్న అమ్మ కనకదుర్గమ్మను దర్శించి, నమస్కరించి చూడు, భక్తి భావనలు వెల్లివిరుస్తాయి. ఆనందభాష్పాలు జాలువారుతాయి. మన పిల్లలు నిత్యం చేసేది అదే. అమ్మా! దుర్గా! భవానీ!
(పిల్లలు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పల్లవి : దుర్గయే అధిదేవత ఇలలో
అభినవ స్వర్గము కలదా సన్నిధిలో ॥దుర్గయే॥

చ. 1. : జగతిని కదిలించు నిగమనుతా
సుగతికి నడిపించు నతజనితా
అభయాలు తొలగించు అమరహితా
విభుని సగమై సాగే శక్తియుతా ॥దుర్గయే॥

చ. 2 : సిరులను వెలిగించు సితచరితా
నరులను కరుణించు వరదాతా
పరమును కలిగించు సురసహితా
విరుల తరులను గాచే విశ్వమాతా ॥దుర్గయే॥

శంకరం: ఆ దుర్గమ్మ తల్లి చల్లని దీవెనలే ఈ కృష్ణాతీర వాసులందరికీ శ్రీరామరక్ష, శివకేశవులకు భేదం లేదని తన దివ్యానుభవంతో చాటిచెప్పిన మహాభక్తుడు ఈ కృష్ణాతీరంలోనే పుట్టాడు.

సురేష్ : ఎవరాభక్తుడు అంకుల్

శంకరం: వరదయ్య

❄❄❄

(శివాలయంలో వరదయ్య ప్రార్థిస్తూ ఉంటాడు)

వరదయ్య : పద్యం : నీవే తల్లివి తండ్రివి
నీవే నా తోడునీడ నీవే సఖుడౌ
నీవే గురుడవు దైవము
నీవే నా పతియు గతియు నిజముగ కృష్ణా

కృష్ణా! మువ్వగోపాలా! కరుణామూర్తివి ఈ క్షేత్రంలో కైలాసవాసుడిగా దర్శనమిస్తున్నావా స్వామీ! ఏ రూపంలో నువ్వు దర్శనమిచ్చినా, ఏ నామంతో నిన్ను కీర్తించినా నాకు గలగల మ్రోగే చిరుగజ్జెలతో, పట్టు పీతాంబరంతో సిరులొలికే చిరునవ్వుతో, మధుర మోహన మురళీగానంతో ముచ్చటగొలిపే మువ్వగోపాలుని గానే నా కళ్ళలో మెదులుతావు స్వామీ! ఒక్కసారి ఆ మధుర మనోహర రూపంలో దర్శనమిచ్చి నన్ను కటాక్షించవా గోపాలా!

పాట–పల్లవి : గోపాలా గోపాలా మువ్వ గోపాలా
రాధాహృదయవిహారా బాల
గోపాలా గోపాలా మువ్వ గోపాలా ॥గోపాలా॥

చ. 1. : నందకిశోరా గోపాలా నవనీతచోరా గోపాలా
కాళీయమర్దన గోపాలా గోవర్ధనధర గోపాలా
గోపాలా గోపాలా మువ్వగోపాలా 2

చ. 2. : మధురానాథా గోపాలా సుమధుర నామా గోపాలా
మందర గిరిధర గోపాలా మానసచోరా గోపాలా
గోపాలా మువ్వగోపాలా 2 ॥గోపాలా॥

గోపాలా! నందగోపాలా! నీ దివ్య సుందరమూర్తిని దర్శించి తరించే మహద్భాగ్యం కల్పించావా స్వామి! పాహిమాం గోపాలా పాహిమాం.

(వరదయ్య కృష్ణుని పాదాలపై వాలి నమస్కరిస్తాడు. కృష్ణా! కృష్ణా! అని స్మరిస్తూ పారవశ్యంలో ఉండిపోతాడు)

పూజారి : అయ్యో! అయ్యో! పరమ శివాలయంలో కృష్ణ నామస్మరణమా! ఎంత అపచారం – ఎవరయ్యా నువ్వు? ఇంత అనాచారానికి పూనుకున్నావు.

వరదయ్య: శివాలయంలో కృష్ణ నామస్మరణం చేయకూడదా మహీశయా

పూజారి : ఎంత ధైర్యం! కూడని పని చేసి పైగా శివాలయంలో కృష్ణ నామస్మరణం చెయ్యకూడదా అని అడుగుతున్నావా? శైవం శైవమే, వైష్ణవం వైష్ణవమే. అయ్యా అవధాని గారూ, పెద్దలు తమరు చెప్పండి.

వేద : తమ పేరు

వరదయ్య: మాది కృష్ణాతీరం

వేద : ఏ ప్రాంతంవారు?

వరదయ్య: మాది కృష్ణాతీరం

వేద : అందుకే ఇక్కడి సంప్రదాయం తెలియదనుకుంటాను. ఏకోదవ: కేశవోవా శివోవా అన్నారు. అంటే శివుడో, విష్ణువో ఒక్కర్నే పూజించాలి అని శాస్త్రం. అందుచేత పరమ నిష్ఠాగరిష్ఠులంతా పూజించే ఈ శివాలయంలో కృష్ణ నామ సంకీర్తన చెయ్యడం నేరం, పైగా పాపం కూడా.

వరదయ్య: అయ్యా! శివస్యహృదయం విష్ణు: విష్ణుస్య హృదయం శివ: అని మన ఆర్ష వాఙ్మయం ఘోషిస్తోంది. అంటే శివకేశవుల మధ్య భేదం లేదని అర్థం కాదా. భగవంతుడొక్కడేనని భావంకాదా?

వేద : మాతో వితండ వాదన చెయ్యకండి. శివకేశవులొకరే అయితే మన పూర్వీకులు వేర్వేరు ఆలయాలెందుకు నిర్మిస్తారు, వేరు వేరు పూజావిధానాలెందుకు కల్పిస్తారు.

వరదయ్య: మనకు నచ్చిన రూపంలో మనం భగవంతుణ్ణి ఆరాధించుకునేందుకు. అంతే తప్ప భేదాలు, వైరుధ్యాలు కల్పించుకునేందుకు కాదు.

వేద : అన్ని రూపాల్లోనూ ఒకే దేవుణ్ణి చూడగల మహాభక్తుడివా నువ్వు?

వరదయ్య: భక్తులమని మనం చెప్పుకోవడం కాదు, భగవంతుడు చెప్పాలి.

వేద : నువ్వు భక్తుడవని భగవంతుడు చెప్తాడా? ఏదీ చెప్పమను.

వరదయ్య: మనం కోరవలసిన అవసరం లేదు మహాశయా! అవసరమనుకుంటే ఆయనే దర్శనమిస్తాడు.

గోపాలా గోపాలా మువ్వగోపాలా

రాధా హృదయ విహారా బాలా

గోపాలా గోపాలా మువ్వ గోపాలా (3)

(శివలింగంలో శ్రీకృష్ణుడు దర్శనం ఇస్తాడు. భగవత్సాక్షాత్కారాన్ని సూచించే నేపథ్య సంగీతం)

వరదయ్య: కృష్ణా! మువ్వగోపాలా! ఈ బిడ్డను కరుణించి సాక్షాత్కరించావా

పూజారి : అద్భుతం! మహా అద్భుతం!! నీలకంఠుడు నీలమేఘశ్యాముడిగా దర్శనం ఇచ్చాడు. చూడండి పరమశివా! నీకంఠా! పాహిమాం! పాహిమాం!

వేద : నా కళ్ళను నేనే నమ్మలేకుండా ఉన్నాను. వరదయ్యా! నువ్వు నిజంగా దేవుడు మెచ్చిన భక్తుడివయ్యా. నీకు మా వందనాలు. మా అపరాధాన్ని క్షమించండి.

వరదయ్య: మీ వందనాలు అందరినీ మన్నించే భక్త సులభుడయిన ఆ భగవంతుడికి చెయ్యండి.

వేద : శ్రీకృష్ణాయ నమోనమ: వరదయ్యా శైవం, వైష్ణవం వేరన్న అజ్ఞానంలో కొట్టుమిట్టాడుతున్న మా అజ్ఞానాన్ని తొలగించి మాలో జ్ఞానజ్యోతిని వెలిగించావు. ఈ పుణ్యక్షేత్రంలో సుమధురమైన

పదాలతో శ్రీకృష్ణుడ్ని కీర్తించావు. నేటినుండి మహాకవి క్షేత్రయ్యగా గొప్ప కీర్తి గడించు.

వరదయ్య: అంతా ఆ మువ్వగోపాలుని కరుణా కటాక్షం.

❄❄❄

సురేష్ : మహాకవి క్షేత్రయ్య కథ అద్భుతంగా ఉందంకుల్

శంకరం: నాట్యంతో భగవంతుణ్ణి ఆరాధించి తరించవచ్చని నిరూపించిన మహనీయుడు సిద్ధేంద్రయోగి కూడా ఈ కృష్ణా తీరంలోనే కూచిపూడిలో పుట్టాడు. మహా భాగవత కథను రసరమ్యంగా భక్తిభావ బంధురంగా జనబాహుళ్యాన్ని అలరించేలా, భగవంతుని ప్రేమ హృదయానికి హత్తుకునేలా నాట్య శాస్త్రానికి రూపకల్పన గావించాడు. గ్రామగ్రామాలలోనే కాకుండా విశ్వమంతా భక్తిభావనా వీచికల్ని వ్యాప్తి చేశాడు. కూచిపూడి భాగవతుల భక్తి పరంపరని అజరామరం చేశాడు.

పాట–పల్లవి : ఉపనిషత్తులలో ఊయలలూగే
ఉజ్జ్వలమూర్తీ సాయీశా ॥ఉపనిషత్తులలో॥

చ. 1 : భక్తి లేనిదే ముక్తి కలగదని
భజనలు చేయుదు పర్తీశా
చిన్మయ శిఖగా జ్ఞాన దీపమును
చిత్తమందు వెలిగించుమయా ॥ఉపనిషత్తులలో॥

చ. 2. : రాగద్వేషములు రక్తనాళముల
రాజసముగా ప్రవహించునయా
ప్రేమతత్వమును హృదయసీమలో
కోమలముగా పండించవయా ॥ఉపనిషత్తులలో॥

రమేష్ : చాలా బాగుందంకుల్, కాని ఇలా మన పూర్వీకుల కథలు చెప్పుకొని గర్వించడమేనా! లేక ఈనాడు కూడా.

శంకరం: ఆ అపూర్వ సంస్కారం, భగవంతుడి కరుణ ఈ కృష్ణా తరంగాలపై ఇప్పటికీ ప్రసరిస్తూ, ప్రతిఫలిస్తూనే ఉన్నాయి. మా గురువుగారు కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారు వేలాది రచనలు చేసి చివరికి రామకథ వ్రాస్తే తప్ప మానవుడు తరించడని తెలుసుకొని 'శ్రీమద్రామాయణ కల్పవృక్షాన్ని" రచించారు. ఈ కృష్ణాతీరంలోనే శ్రీరామచంద్ర ప్రభువుకు అంకితమిచ్చారు. మరో అద్భుతం చెప్పనా సురేష్.

రమేష్ : చెప్పండి

శంకరం: ఈ కృష్ణా సాగరతీరంలో బృందావనపుర సాగర క్షేత్రంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు శేషసాయిగా దర్శనం ఇచ్చారు. సముద్రజలాల్ని తన దివ్య స్పర్శతో అమృతంగా మార్చి ఈ కృష్ణా తీరవాసులందరికీ ప్రసాదంగా అనుగ్రహించారు.

రమేష్ : భగవంతుడు ఈ కలియుగంలో శేషసాయిగా దర్శనమిచ్చాడా?

శంకరం: అవును. ఆ భగవంతుడే శ్రీ సత్యసాయి, క్షీరసాగరంలో పన్నగశయనుడైన విష్ణుమూర్తిలా అద్భుత దర్శనమిచ్చి తాను జగద్రక్షకుడైన శ్రీమన్నారాయణమూర్తినని భగవాన్ సర్వప్రపంచానికి తెలియజేసారు. నేనేకాదు, వేలాదిమంది కృష్ణాతీరవాసులు ఈ అద్భుత సంఘటనను ఆనంద పారవశ్యంతో తిలకించారు. అంతేకాదు, ఈ కృష్ణాతీరంలోనే భక్తితో అర్చించమని అవ్యాజ ప్రేమతో ప్రేమలింగాన్ని కూడా బాబా అనుగ్రహించారు. ఇప్పుడు తెలిసిందా ఈ కృష్ణాతీరం ఎంత పవిత్రమైనదో.

సురేష్ : చక్కగా అర్థం అయింది అంకుల్

శంకరం: సురేష్ ఈ కృష్ణాతీరమే కాదు, దేశం కోసం, దైవం కోసం, బాంధవ్యాల్నీ అనుబంధాల్నీ కూడా లెక్కచేయక సర్వస్వాన్ని త్యాగం చేసిన త్యాగధనులను కన్నతల్లి మన భరతభూమి.

పద్యం : తల్లి కైవడి అన్ని తప్పుల సైచియు
పుణ్య మొసగునట్టి పూజ్య భూమి
వలదన్న సద్గ్రంథ పఠనంబు లేకయె
పలు శాస్త్రములు నేర్పు పాఠశాల
శ్రమ లేక తనయందు సర్వంబు సమకూర్చి
ఆనందమొసంగు విహార భూమి
అజహరాదుల నైన పసి పాపలుగ జేయు
మహిమను చేకూర్చు మంత్రశాల
భరతదేశము వేదాల పట్టుకొమ్మ
యజ్ఞయాగాది క్రతువుల కాటపట్టు
పెక్కు అవతారములు గన్న పెద్దతల్లి
నీతి నియమాల రూపు ఈ త్యాగభూమి

మన దేశ ఔన్నత్యాన్ని తెలుసుకోవాలి. దేశభక్తి మన నరనరాల్లోని ప్రవహించాలి. నీతినియమాలే

మన ప్రాణంగా మారాలి. యువకుల మనసుల్లో ఈ భావాలు నింపడమే నా లక్ష్యం సురేష్. మన యువతను చూడు.

(యువకులు నృత్యం చేస్తూ ప్రవేశిస్తారు)

పాట-పల్లవి : మన మాతృభూమి ఈ దివ్యభారతికి వందేమాతరం
మన మాతృమూర్తి శ్రీ సత్యసాయి అని అందీమాతరం
వందే వందే మాతరం అందీ అందీ మాతరం ॥మన॥

చ. 1. : సత్యస్ఫూర్తిని యెదలో నింపిన కన్నతల్లి మన భారతి
ధర్మనిరతితో వన్నెకెక్కిన ధర్మభూమి మన భారతి
ధీనానాధుడు అవతరించిన దివ్యభూమి మన భారతి
అన్ని మతాలను అక్కున చేర్చిన పుణ్యభూమి మన భారతి
వందే వందే మాతరం అందీ అందీ మాతరం ॥మన॥

చ. 2. : ప్రేమరాజ్యమే రామరాజ్యమని పలికిన సాయికి వందనం
సేవను మించిన పూజే లేదని చూపిన సాయికి వందనం
దీనుల మదిలో ఆశాజ్యోతిగ వెలిగే సాయికి వందనం
అమృతప్రేమకు అద్భుతరూపం సాయి జననికి వందనం
వందే వందే మాతరం అందీ అందీ మాతరం ॥మన॥

సురేష్ : మరి అ ఉన్నత భావాల్ని మనలో ఎలా వికసింపచేసుకోవాలి అంకుల్?

శంకరం: సాయిబాటలో పయనించండి. సాయిబాటంటే ప్రేమబాట.

సురేష్ : నావారు, పైవారు అనే భేదం లేకుండా అందర్నీ ప్రేమించడం కష్టంకాదా.

శంకరం: కష్టమే. కాని దీన్ని సాధించగల సులువైన మంత్రం చెప్పారు బాబా. సాధారణంగా మనం ముందు మన గురించి, తరువాత ఇతరుల గురించి, ఆ తర్వాత దేవుడి గురించి ఆలోచిస్తాం. కాని బాబా, ముందు దైవం గురించి, తరువాత ఇతరుల గూర్చి, ఆఖరున నీ గురించి ఆలోచించు అంటారు. ఇది గుర్తు పెట్టుకో.

రమేష్ : అలాగే. ఇంకేం చెయ్యాలంకుల్.

శంకరం: త్యాగరాజు, రామదాసు, నామదేవుడు, తుకారాం వంటి భక్తుల జీవితాలు, వారి సాధనా పరిశీలించండి. వారెవరైనా ధనం లేదని విచారించారా? వస్తు వాహనాలు లేవని బాధపడ్డారా? కష్టాల కడలిలో మునిగి తేలుతున్న మానవాళిని చూసి కన్నీరు కార్చారు. లోక కల్యాణం

కోసం ఆరాటపడ్డారు. భగవాన్ బాబానే తీసుకోండి. దాహార్తుల్ని, రోగార్తుల్ని చూసి హృదయం ద్రవించి, ఆస్పత్రులు, మంచినీటి వసతులు కోట్లాది ప్రజలకు కల్పించలేదా?

రమేష్ : బాబాను ఆదర్శంగా ఎలా తీసుకోవాలి?

శంకరం: అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు, ఎప్పుడూ సహాయం చెయ్యి ఏనాడూ బాధపెట్టకు అన్న వారి బోధల్ని వినండి. సురేష్ మనం చేసే ప్రతి పనినీ భగవంతుడు గమనిస్తూంటాడనీ, అడగకపోయినా ఫలితాన్ని అందిస్తాడనీ గ్రహించండి. ధనాన్ని తృణప్రాయంగా చూడండి. మంచినీ, మానవత్వాన్ని వజ్రసమానంగా భావించండి. అప్పుడే మీ బంగారు భవిష్యత్తుకు రాచబాట వేసుకోగలుగుతారు. నా జీవితమే నా సందేశం అన్న బాబా అడుగుజాడల్ని అనుసరించండి. భక్తితో, శ్రద్ధతో, విశ్వాసంతో సేవా సైన్యంలా కదను త్రొక్కితే వారే చేయి పట్టుకుని మనని నడిపిస్తారు.

సురేష్ : మీరాశించినట్టు మేం జీవిస్తాం అంకుల్. బాబా చూపిన సేవామార్గంలో పయనిస్తాం. మా జీవితాల్ని మానవసేవకే అంకితం చేస్తాం.

పాట-పల్లవి : పదండి ముందుకు పదండి ముందుకు
పవిత్రాత్మల మానవులారా!
ప్రపంచంతా ప్రేమగీతమును
ప్రతిధ్వనించే వేలుపులారా ॥పదండి॥

చ. 1. : వాయువేగమున మనోవేగమున
సాయిగీతమును చాటండీ
కొండలు దాటి కోనలుదూకి
సముద్రఘోషల సందడి మీటి
సముద్రభూతలము నిండండీ
సర్వవిశ్వమును పొందండీ

చ. 2. : అన్ని మతములకు ఆదిమూలమగు
ఆత్మతత్త్వమును పాడండీ
సర్వలోకముల సనాతనమ్మగు
సత్యధర్మముల చాటండీ ॥పదండి॥

❄❄❄

(రంగనాథం ఇల్లు)

జగన్నాథం: కంగ్రాచ్యులేషన్స్, మీ సురేష్‌కి కోటి రూపాయల కాంట్రాక్టు లభించిందట. కనీసం పాతిక లక్షలు లాభం వస్తుందనుకుంటున్నారు. రంగనాథం! అదృష్టవంతుడివయ్యా.

రంగనాథం: జగన్నాథం, పదేళ్ల నా కృషి ఫలించిందయ్యా. నేను పడ్డ కష్టానికి ప్రతిఫలం లభించింది. మన శంకరం లేడూ, వాడు "ఇదంతా దేవుడి దయ" అంటాడు. నేను కష్టపడ్డాను. ఫలితం పొందాను. ఇందులో "దేవుడి దయ" ఏముంది చెప్పు.

జగన్నాథం: నాకూ అదే అర్థం కాదయ్యా. కష్టం మనదీ, పేరు దేవుడిదీనా? పండగా పబ్బం వస్తే ఓ పూజో, అభిషేకమో, వ్రతమో చేస్తాం. పండూ, ఫలం నైవేద్యం పెడతాం. దట్సాల్. దేవుణ్ణి అతని సరిహద్దుల్లో ఉంచాలి కాని, మన Day to Day routine లోకి లాగచ్చా తప్పు కాదూ!

రంగనాథం: అవసరమైతే ఓ విరాళం ఇవ్వొచ్చు. ఓ గుడో, గోపురమో కట్టించొచ్చు అంతే కాని మన ప్రతీ సక్సెస్‌కి ఆయనే కారణమెలా అవుతాడయ్యా?

జగన్నాథం: మన సంపాదన చూసి ఓర్వలేక ఈ శంకరం మనమేదో అశాంతితో అల్లాడుతున్నట్టూ, తానేమో దేవుణ్ణి నమ్ముకుని ఏ చీకూ చింతా లేకుండా హాయిగా ఉన్నట్టూ కథలు, కబుర్లు చెబుతుంటాడు.

రంగనాథం: ఆ! ఎప్పుడన్నా ఏ.సి. కార్లో తిరగగలిగాడా? తాజ్ హోటల్లో డిన్నర్ చేయగలిగాడా? వేసవి విడిదికి శ్రీనగరో, సిమ్లానో వెళ్ళగలిగాడా?

జగన్నాథం: వాడి ముఖానికి ఏ.సి.కారూ, తాజ్ హోటలూ, సిమ్లా ట్రిప్పూనా. రంగా! అసూయ, ప్యూర్ జలసీ, ఇంతకీ కాంట్రాక్టు సైన్ చెయ్యడానికి మీ వాడి ప్రయాణం ఎప్పుడు?

రంగనాథం: ఈ రోజే. పన్నెండు గంటల ఫ్లైట్‌కి ఢిల్లీ వెళుతున్నాడు

జగన్నాథం: ఏడీ కనిపించడేం?

రంగనాథం: శంకరానికి చెప్పొద్దామని వెళ్ళాడు. వాడి ఆశీస్సులు కావాలిట. ఏం పోయిందిలే అని వెళ్ళమన్నాను.

జగన్నాథం: వాడి ఆశీస్సులెందుకు?

రంగనాథం: తియ్యటి కబుర్లూ, కథలూ చెప్పి యువకుల్ని ఆకర్షించే టెక్నిక్ వాడికి తెలుసు కదా.

జగన్నాథం: మీవాణ్ణి వాడి వలలో పడనిచ్చేవు జాగ్రత్తసుమా!

రంగనాథం: ఆ! వ్యాపారంలో మునిగిపోయి గంటలు క్షణాల్లా గడిచిపోతుంటే, లక్షల రూపాయలు కళ్ళముందు కదలాడుతూ వుంటే ఈ శంకరం వీడి నీతులూ గుర్తుంటాయా. మనమేం చెప్పక్కరలేదు.

వాడే మరచిపోతాడు.

జగన్నాధం: నిజమే అనుకో. కాని శంకరం దేవుణ్ణి నమ్ముకుంటే జరిగే అద్భుతాల గురించి చెబుతుంటే మాటా, చేష్టా లేకుండా ఈ కుర్రకారంతా నిజమేనని నమ్మేస్తున్నారు. వాడి మాటే వేదవాక్కులా పాటిస్తున్నారు. అదీ భయం.

రంగనాధం: నీకెప్పుడు తెలిసింది?

జగన్నాధం: ఆదివారం ఉదయం ఠంచనుగా టి.వి. ముందు తిష్ట వేసుక్కూర్చునే మావాడు ఇప్పుడు గ్రామ సేవయే రామసేవని పరుగెడుతున్నాడు. సరే మన కార్యక్రమాలకీ అడ్డుండడు కదా అని పొమ్మంటున్నాను.

రంగనాధం: ఇప్పుడా పరుగుకి బ్రేక్ వేసి మా వాడిలాగే మీ వాడికీ ఏదో వ్యాపారమో, మరో వ్యాపకమో పెట్టు. లేకపోతే ఏ గౌతమబుద్ధుడో, గాంధీమహాత్ముడో అయిపోగలడు.

(ఇద్దరూ నవ్వుకుంటూ ఉండగా శంకరం ప్రవేశం)

శంకరం: రంగా! రంగా! మీ సురేష్ ఏడీ (గాభరాగా అడుగుతాడు)

రంగనాధం: ఏం భాగవత పురాణం బోధిస్తావా, భారతం డ్రామా వేయిస్తావా, రామాయణం హరికథ వినిపిస్తావా?

శంకరం: రంగా! హేళనకిది సమయం కాదు. దయచేసి మీవాడెక్కడున్నాడో అర్జంటుగా చెప్పు.

జగన్నాధం: చెప్పకపోతే పోలీసు కంప్లైంటిస్తావా, ఇంతకీ ఎందుకంత గాభరా పడుతున్నావు. డబ్బేమన్నా కావాలా?

శంకరం: ఆపు జగన్నాధం, ఆపు. డబ్బా డబ్బా డబ్బు. డబ్బు తప్ప ఇంకేమీ మీ కళ్లకి కనిపించవా. డబ్బు కోసం తప్ప ఇంక దేనికోసం ఆతృత పడరా. ముందు సురేష్ ఎక్కడున్నాడో త్వరగా చెప్పండి.

రంగనాధం: వాడు మీ ఇంటికే వెళ్ళాడు, రాలేదా?

శంకరం: మా ఇంటికి వెళ్ళాడా? ఒక్కమారు ఫోన్ చెయ్యి రంగనాధం! నేను అర్జంటుగా రమ్మన్నానని.

రంగనాధం: చేస్తాను, వాడు వస్తాడు. కానీ, వాడిని పిలుస్తున్నది నీతో తీరిగ్గా మాట్లాడటానికి కాదు. వీడికి టైముండదు.

శంకరం: ఏం!

రంగనాధం: వాడు 12 గంటల ఫ్లైట్‌లో ఢిల్లీ వెళుతున్నాడు. పది నిముషాల్లో ఎయిర్‌పోర్ట్‌కి బయలుదేరాలి. వాడి మమ్మీ అప్పుడే లగేజీతో బయల్దేరి వెళ్ళిపోయింది. వాడికోసం వెయిట్ చేస్తున్నాను

నేను. ఇంతకీ వాడితో పనేంటి. మళ్ళీ ఎవరినైనా ఉద్ధరించాలా?

శంకరం: ఔను, ఒక పేద యువకుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడు. వాళ్ళ కుటుంబానికి అతనే ఆధారం. అతనికి అర్జంటుగా 'AB నెగిటివ్ blood కావాలి. అది చాలా అరుదైన బ్లడ్

గ్రూపు. మీ సురేష్‌ది అదే గ్రూపు. సురేష్ ఒక యూనిట్ రక్తం దానం చేస్తే ఆ యువకుడి

ప్రాణం నిలబడుతుంది. వాళ్ళు నిరాశ్రయులైపోతారు. రంగనాథం! ప్లీజ్ అర్జంటుగా మీ వాడికి

రమ్మని ఫోన్ చెయ్యి.

రంగనాథం: రోజూ అనేకమంది చనిపోతూ ఉంటారు. అందర్నీ మనం ఆదుకోగలమా. ఇదుగో వాడి దహన సంస్కారానికి వెయ్యి రూపాయలు విరాళం తీసుకో. ఆ పని చూడు.

శంకరం: ధనం ఉంది కదా అని గర్వపడకు. ఇతరుల్ని చులకన చెయ్యకు. నిన్ను భిక్షమెత్తడానికి రాలేదు నేను.

రంగనాథం: మరి ధనవంతుల పిల్లల్ని ఎందుకు చేరదీస్తున్నట్టు. వాళ్లకి పనికిమాలిన ఉపదేశాలెందుకిస్తున్నట్టు.

శంకరం: ధనం కోసం మాత్రం కాదు. ధనవంతుడు మంచివాడైతే పదిమందికి ఉపకారం జరుగుతుంది. సంపన్నుడు స్వార్ధపరుడైతే ఎంతోమందికి అపకారం జరుగుతుంది.

రంగనాథం: ధనవంతులంటే స్వార్ధపరులని నీ అభిప్రాయం ఆ! నీతో వాదించడానికి టైము లేదు నాకు (ఫోన్ చేస్తాడు) హలో! సురేష్! ఫ్లైట్‌కి టైమౌతోందిరా. ఎక్కడున్నా వెంటనే వచ్చేయి.

శంకరం: చూడు రంగా! నాకా అభిప్రాయం ఉంటే మీ ఇంటి దరిదాపులకే రాను. తమకున్న ధనాన్ని సద్వినియోగం చేసిన ఎంతోమంది త్యాగమూర్తులు నాకు తెలుస. మీరు ఆ కోవకు చెందాలనే నా తాపత్రయం. (సురేష్ ప్రవేశిస్తాడు)

సురేష్ : అంకుల్ మీరిక్కడున్నారా! నేను మీ ఇంటికి వెళ్ళాను.

రంగనాథం: మాట్లాడుతూ కూర్చోకురా. అవతల ఫ్లైట్‌కి టైమయింది పద.

సురేష్ : ఒక్క క్షణం ఉండండి డాడీ.

శంకరం: సురేష్, నీకోసం వెయ్యి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. 'సూర్యా ఆస్పత్రి'లో ఒక యువకుడు ప్రాణాపాయ పరిస్థితిలో ఉన్నాడు. అతనికి అర్జంటుగా 'AB నెగిటివ్' రక్తం కావాలి. నువ్వు రక్తదానం చేస్తే అతను బ్రతుకుతాడు. జీవితాంతం ఆ కుటుంబం నీకు ఋణపడి ఉంటుంది. పద సురేష్.

జగన్నాథం: వీడిలాంటివేవో చెబుతూనే ఉంటాడు. నీ ఫ్లైట్‌కి టైమయింది పద సురేష్. పద రంగా! మీవాణ్ణి తీసుకెళ్ళు.

శంకరం: సురేష్ ఒక్కసారి ఆలోచించు. ఢిల్లీ రేపైనా వెళ్ళొచ్చు. కాని పోయిన ప్రాణం తిరిగి రాదు. ఒక ప్రాణం నిలబెట్టినవాడివవుతావు. నాతో ఆస్పత్రికి రా.

రంగనాథం: శంకరం! ఫ్లైట్‌కి టైమయింది. దయచేసి నువ్వడ్డు పడకు. ఇలాంటి కేసులు రోజూ ఉంటూనే ఉంటాయి. రక్తదానానికి మరెవరినైనా చూసుకో. సురేష్ మనం ఇప్పటికే లేటయ్యాం పద.

సురేష్ : ఆస్పత్రికి పదండంకుల్.

రంగనాథం: Are you made నీకు పిచ్చి పట్టిందా. అవతల ఫ్లైట్‌కి గంటే టైముంది. కోట్ల విలువ చేసే కాంట్రాక్టు సైన్ చెయ్యాలి నువ్వు. Come on పిచ్చి మాటలు మాట్లాడక, బయల్దేరు.

సురేష్ : నేను ఆస్పత్రికి వెళతాను. ఆ యువకుడి ప్రాణాలు కాపాడాలి.

జగన్నాథం: సురేష్! రోజూ వందమంది ఛస్తూ ఉంటారయ్యా. వాళ్ళందరి కోసం మన పనులు మానుకుంటామా చెప్పు.

సురేష్ : అంకుల్ ఇదే పరిస్థితిలో మీ కొడుకే ఉంటే ఇలా మాట్లాడేవారా?

జగన్నాథం: ……

సురేష్ : ఏం నిశ్శబ్దంగా ఉండిపోయారు. అప్పుడందరం అన్ని పనులూ మానుకుని మీ కొడుక్కోసం పరుగెత్తాలి. ఆ సమయంలో అప్పుడు అందర్నీ త్యాగమూర్తులని మీరు పొగుడుతారు. ఏం ఆ యువకుడు మీ కొడుకులాంటివాడు కాడా? శంకరం అంకుల్‌కి నేను మాటిచ్చాను. ఎందుకో తెలుసా. ఆయనకి నన్ను రక్తదానం చెయ్యమని అడిగే అర్హత ఉంది. ఇప్పటికి వందసార్లు రక్తదానం చేసి వందమంది ప్రాణాలు కాపాడిన మహనీయుడాయన. భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి బోధనల్ని, సూచనల్ని అనుక్షణం పాటిస్తున్న వ్యక్తి. ఆయన దీన జనుల సేవకే తన జీవితాన్ని అంకితం చేశారు.

రంగనాథం: వాడికి మనకున్న బాధ్యతల్లేవు. అందుచేత ఏమైనా చేస్తాడు. మనది కోట్లలో వ్యాపారం. మనకెలా వీలవుతుంది.

సురేష్ : మనస్సుంటే మార్గం ఉంటుంది డాడీ. ఇదే మీ ఆత్మీయుడైతే వ్యాపారం వదులుకుని పరుగెత్తరా?

శంకరం: సురేష్! టైమవుతోంది. ఆస్పత్రికి వెళదాం. వేగంగా పద.

సురేష్ : గాభరా పడకండి అంకుల్. ఢిల్లీ వెళ్ళేముందు మంచి మనస్సుతో మీరిచ్చే ఆశీస్సులు తీసుకుందామని మీ ఇంటికి వెళ్లాను. మీరు అర్జంటుగా 'సూర్యా ఆస్పత్రి'కి వెళ్ళేరని తెలిసింది. ఎవరో పేషంట్ ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని కూడా తెలిసింది. నేను 'సూర్యా ఆస్పత్రి'కి వెళ్ళాను. ఆ పేషెంటు వివరాలు కనుక్కున్నాను. అతనికి రక్తదానం చేసే వచ్చాను. డాక్టర్లు ఆ

యువకుడికి ప్రాణాపాయం లేదని చెప్పారు అంకుల్.

శంకరం: థాంక్స్, థాంక్స్ సురేష్, ఒక నిండు ప్రాణాన్ని నిలబెట్టేవు. May God bless you my boy.

సురేష్ : నేనే మీకు థాంక్స్ చెప్పాలి అంకుల్, ఒక మంచి సేవ చేసే అవకాశం నాకిచ్చారు.

రంగనాథం: అవతల ఫ్లైట్‌కి టైమవుతూంటే, కోట్ల వ్యాపారం ముందుంచుకుని నిమ్మకు నీరెత్తినట్లు లోకోద్ధరణ చేస్తున్నావన్నమాట.

సురేష్ : కథ ఇంకా అయిపోలేదు డాడీ వినండి. ఆస్పత్రి నుంచి బయటికి వస్తూంటే ఏంబులెన్స్ ఆగింది. ఎవరో అని చూద్దును కదా, అమ్మని స్ట్రెచర్ మీద ఆస్పత్రిలోకి తీసుకెళ్తున్నారు. నాకు భయం వేసింది. 'మా అమ్మను కాపాడు తండ్రీ' అని బాబాకు నమస్కారం చేసుకుని ఎమర్జన్సీ వార్డ్‌లోకి వెళ్ళాను. అమ్మ నన్ను చూసి ప్రేమగా నవ్వింది.

రంగనాథం: అమ్మకేం జరిగిందిరా?

సురేష్ : మీరు గాభరా పడకండి డాడీ. అమ్మ బాగానే ఉంది. ఎయిర్‌పోర్ట్‌కి లగేజితో వెళ్తున్న అమ్మ కారుని అదుపు తప్పిన లారీ గుద్ది ఏక్సిడెంట్ అయింది. కారు బాగా దెబ్బ తింది. కానీ విచిత్రంగా డ్రైవరూ, అమ్మ చిన్న గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు.

రంగనాథం: అర్జంటుగా అస్పత్రికి వెళదాం పద.

సురేష్ : మరి ఢిల్లీ ఫ్లైట్‌కి టైమవుతోంది కదా

రంగనాథం: రేపు ఫ్లైట్‌కి వెళ్ళచ్చు. అమ్మ ఆస్పత్రిలో ఉంటే వెళ్ళిపోతావా?

సురేష్ : మనిషన్నాక ఏవో ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. అవన్నీ పట్టించుకోమంటారా?

రంగనాథం: ఆ మాటలు అనడానికి నీకు సిగ్గు వెయ్యడంలేదూ. ఆస్పత్రిలో ఉన్నది నీ కన్న తల్లిరా.

సురేష్ : కట్టుకున్న భార్య గురించి మీరింత బాధపడుతున్నారే మరి కన్నకొడుకు గురించి ఆ యువకుడి తల్లితండ్రులు ఎంత బాధపడ్డారో, ఎన్ని కన్నీళ్ళు కార్చారో, ఎంతమంది దేవుళ్ళకు మొక్కుకున్నారో ఊహించారా?

శంకరం: సురేష్ భాధలో ఉన్నప్పుడు అలా ఎగతాళి చెయ్యకూడదు నాన్నా. మీ అమ్మగార్ని చూడడానికి వెళ్లు.

సురేష్ : ఆయనకి నిజం తెలియాలనే అన్నాను అంకుల్. నేను మా అమ్మకి అన్ని సపర్యలూ చేసి వచ్చాను. మా అమ్మ ఘోరమైన ప్రమాదానికి గురైనా గాయాలు తగలకపోవడానికీ, ఆమె సురక్షితంగా బయటపడడానికీ కారణం నేనా యువకుడికి రక్తదానం చెయ్యడమేనని నా

ప్రగాఢ విశ్వాసం అంకుల్. ఇందాక May God bless you అని మీరు నన్ను దీవించారు. కానీ God has already blessed meఅంకుల్.

శంకరం: నువ్వు కరెక్టుగా చెప్పేవు సురేష్. సేవ చేసినవాడిని సేవ్ చేస్తానని 'బాబా' పదే పదే చెబుతూ ఉంటారు.

సురేష్ : "నాన్నా! నువ్వు చేసిన సేవలే నన్ను కాపాడేయిరా అని" మా అమ్మ కన్నీళ్ళు పెట్టుకుందంకుల్.

శంకరం: 'భగవంతుడి దయ' అలాగే ఉంటుంది సురేష్. అస్పత్రికి పద మీ అమ్మగారిని చూసొద్దాం.

రంగనాథం: శంకరం "దేవుడి దయ" అన్న నీ మాటలు తప్పుగా అర్థం చేసుకునేవాడినిరా. నన్ను క్షమించు.

శంకరం: రంగనాథం! అర్థం చేసుకోవడానికి తగిన అనుభవం, అవకాశం ఇప్పుడు దేవుడు కల్పించాడు సంతోషించు రంగా! చదువుకున్న వాళ్లెంతమందో, వ్యాపారం చేస్తున్న వాళ్ళెంతమందో, వాళ్లందరూ నీలా కోటీశ్వరులు కాగలిగారా? నీ పూర్వ జన్మ సుకృతం. 'భగవంతుడి దయ'. పదిమంది నిస్సహాయుల్ని ఆదుకో. భగవంతుడిచ్చిన సంపదని సద్వినియోగం చేసుకో. నువ్వూ, నీ కుటుంబం ఆనందసాగరంలో ఓలలాడుతారు.

సురేష్ : ఇంకొక విషయం చెప్పనా డాడీ.

రంగనాథం: ఏమిటి సురేష్?

సురేష్ : నేను ఢిల్లీ వెళ్ళవలసిన ఫ్లైట్ అనివార్యకారణాలవల్ల ఈరోజు ఆరుగంటలు లేటు. పదండి ఆస్పత్రికి వెళ్ళి అమ్మను చూసి ఆమె ఆశీర్వాదాలు తీసుకుని అలాగే ఎయిర్‌పోర్ట్‌కి వెళదాం. డాడీ! మనం చేసే ప్రతీ పనినీ భగవంతుడు గమనిస్తూ ఉంటాడని ఇప్పటికైనా గుర్తుంచుకోండి.

రంగనాథం: Yes, You are right my son.

జానకమ్మ: నాయనా సురేష్

సురేష్ : అమ్మా ఆస్పత్రినుంచి వచ్చుశావేం?

జానకమ్మ: తల్లి ప్రాణం కదరా! నువ్వెక్కడ వెళ్ళిపోతావేమోనని వచ్చేశానురా.

రంగనాథం: ఏక్సిడెంట్ అనగానే హడలిపోయాను. వంట్లో బాగుందా జానకీ.

జానకమ్మ: క్షేమంగా ఉన్నానండి. ఇదుగో నా బిడ్డ సేవ చేయబట్టి బాబా కరుణతో బ్రతికి బయటపడ్డాను.

శంకరం: గోరంత సేవ చేస్తే కొండంత అనుగ్రహాన్ని కురిపిస్తారమ్మా బాబా. ఇక్కడే కాదు ఏ దేశం వెళ్లినా ఏ గ్రామం చూచినా స్వామి దివ్యానుగ్రహం అనుభవంలోకి వస్తుందమ్మా.

రంగనాథం: మా జానకి దృష్టాంతమే మాకు ప్రత్యక్ష సాక్ష్యం. శంకరం, ఇకనుండి సాయిబాటలోనే మా కుటుంబమంతా నడుస్తాం. వారి సేవలోనే తరిస్తాం.

జానకి : స్వామీ! ఏ సాధనా చెయ్యకపోయినా మమ్మల్ని నీ పాదాల చెంతకు చేర్చుకున్నావా తండ్రీ.

శంకరం: చేర్చుకుంటాడమ్మా మన కన్నీటితో వారి పాదాలని అభిషేకిస్తే, దీనుల సేవయే దీనానాధుని సేవగా ఆచరిస్తే స్వామి తన పాదాల వద్దకు తప్పక చేర్చుకుంటాడమ్మా.

పాట–పల్లవి: కన్నీటి పాదాలు కడిగేము తల్లీ
కరుణాతరంగిణీ మాకల్పవల్లీ
శరణం జననీ సత్యసాయి జననీ ॥కన్నీటి॥

చ. 1. గ్రామసేవయే శ్రీరామపాదసేవ అని అన్నావు
పల్లెసేవయే పరమాత్ముని సేవగ బోధించావు
అమ్మా నీ ఆనతిని భక్తితో తలదాల్చాము
సాయిమాట బాటగా పల్లెసీమ చేరాము ॥కన్నీటి॥

చ. 2. శరణంజననీ అని సంకీర్తన చేశాము
గుండె గుండెలో నిండిన సాయిని దర్శించాము
సేవాకుసుమాలు నీ పదములకర్పించాము
శరణం జననీ సత్యసాయి జననీ ॥కన్నీటి॥

చ. 3. నీవులేని మా హృదయం శూన్యమందిరం
నీవులేక నిర్జీవం మా జీవనపయనం
అమ్మా నీ పిల్లలము చల్లగ దీవించవమ్మ
మా జీవనజ్యోతివై నడిపించవమ్మా
శరణం జననీ సత్యసాయి జననీ ॥కన్నీటి॥

❄❄❄❄❄